క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేసే ప్రాంతాలివే

చిలకలూరిపేట: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పట్టణంలోని పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ డీఈఈ ఆర్ అశోక్ కుమార్ తెలిపారు. పట్టణంలోని ఎన్ఆర్‌టీ సెంటర్, పండరీపురం, సంజీవనగర్ నుంచి అడ్డరోడ్డు సెంటర్ వరకు సంబంధిత వేళల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నరసరావుపేటలో...

నరసరావుపేట: పట్టణంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం కొన్ని ప్రాంతాల్లో శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు వై.ఏడుకొండలు శుక్రవారం వెల్లడించారు. రామిరెడ్డిపేట అన్నపూర్ణమ్మ హాస్పిటల్ రోడ్డు, కావేరి ట్రావెల్స్ రోడ్డు, చెక్‌పోస్టు రోడ్డు నిలిపివేయటం జరుగుతుందన్నారు. అలాగే ప్రకాష్ నగర్‌లోని పార్కు రోడ్డు, సెయింటాన్స్ స్కూలు రోడ్డు, క్రిస్టియన్‌పాలెం, కడియాల హాస్పిటల్ రోడ్డులో సరఫరా నిలిపివేస్తామన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



వినుకొండ (నూజెండ్ల): పట్టణంలోని 14వ వార్డులో పారిశుద్ధ్య పనులను అధికారులు, కౌన్సిలర్లు శుక్రవారం పరిశీలించారు. అదే విధంగా పట్టణంలోని పారిశుద్ధ్య పనుల కోసం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన యంత్ర పరికరాలను వారు పరిశీలించారు. కార్యక్రమాల్లో కౌన్సిలర్లు షేక్ షకీలా, జయరాజు, ఎన్విరాన్మెంటల్ ఏఈ దేవిక, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు క్రియేటివిటీ పోటీలు

నరసరావుపేట ఈస్ట్: శ్రీకల్పవల్లి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణ చిన్నారులకు క్రియేటివిటీ ప్రోగ్రామ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు ట్రస్ట్ చైర్మన్ వెలంపల్లి కేశవరావు శుక్రవారం తెలిపారు. పట్టణంలోని 8 నుంచి 12 సంవత్సరాలలోపు బాలబాలికలు ఆన్‌లైన్ ద్వారా క్రియేటివిటీ పోటీలో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. 30 నిముషాల కాలవ్యవధిలో చిన్నారులు గ్రూపుగా ప్రదర్శన చేసి తీసిన విడియోను జూన్ 16వ తేదీలోగా వాట్సప్‌లో పంపించాలని కోరారు. అక్షరాస్యత, నిరక్షరాస్యత, సెల్‌ఫోన్ వినియోగం, ఉమ్మడి కుటుంబం, మద్యపానం, దేశ సంరక్షణ, ట్రాఫిక్ నిబంధనలు తదితర అంశాలను క్రియేటివిటీ ప్రోగ్రామ్‌కు ఎంచుకోవచ్చని వివరించారు. విడియోను వెలంపల్లి కేశవరావు 9247199146, రెడ్డి మురళీకృష్ణ 9885422058, చేగు వెంకటేశ్వరరావు 9246453348, కేఎంఎల్ ప్రసాద్ 9030448423 నెంబర్లకు పంపాలని కోరారు.

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

నాదెండ్ల: గణపవరం చుండి రంగనాయకులు డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి సంవత్సరం విద్యార్థులు పరీక్షలు రాశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పరీక్షలు జరిగాయి. 172 మంది విద్యార్థులకు గాను 15 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొదటి రోజు తెలుగు, సంస్కృతం, ఉర్దూ పరీక్షలు జరిగాయి. పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్‌గా సత్తెనపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల లైబ్రేరియన్ శ్రీలక్ష్మీ, అసోసియేటెడ్ చీఫ్ సూపరింటెండెంట్‌గా కళాశాల వైస్ ప్రిన్సిపల్ సీహెచ్ చైతన్య వ్యవహరించారు. తొలిరోజు సిట్టింగ్ స్క్వాడ్ తనిఖీ చేశారు. నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకపోవటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు ఉదయం 8.30 గంటల వద్దకే కళాశాల వద్దకు హాజరుకాగా, 8.45 గంటలకు పరీక్ష హాలులోకి అనుమతించారు.

కిషోర బాలికలకు పరిశుభ్రతపై అవగాహన



బొల్లాపల్లి : మండలంలోని గరికపాడు అంగన్‌వాడీ కేంద్రంలో కిషోర బాలికలకు పరిశుభ్రత గురించి శుక్రవారం అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ ఈపూరు ప్రాజెక్టు సీడీపీవో బి.అరుణ మాట్లాడుతూ కిషోర బాలికలు శారీర పరిశుభ్రత పట్ల తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఋతుక్రమ సమయంలో పాటించాల్సిన జాగ్రత్తల గురించి తెలిపారు. శానిటరీ ప్యాడ్స్ వినియోగించాలన్నారు. ప్రతి ఆరు గంటలకు ఒకసారి శానిటరీ ప్యాడ్స్ మార్పు చేసుకోవాలని సూచించారు. వాడిన ప్యాడ్స్‌ను కవర్‌లో పెట్టి చెత్తకుండిలో వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ మస్తాన్‌బీ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, కిషోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

ఓట్లు లెక్క పెట్టేది ఇలా...

- రొంపిచర్ల మండలం నుంచి కౌంటింగ్ ప్రారంభం
- అనంతరం నరసరావుపేట మండలంలోని 11 గ్రామాలు
- మధ్యలో పట్టణంలోని పోలింగ్ కేంద్రాల కౌంటింగ్
- చివరగా నరసరావుపేట మండలం మిగిలిన గ్రామాలు
- 18 రౌండ్లలో ఎన్నికల కౌంటింగ్



నరసరావుపేట రూరల్: సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై నియోజకవర్గ ప్రజల్లో ఉత్కంఠ నెలకొంది. ఈ నెల 13వ తేదీన నిర్వహించిన ఎన్నికల్లో నియోజకవర్గంలో 81,06 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 2,32,778 మంది ఓటర్లు నియోజకవర్గంలో ఉండగా 1,88,701 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఓటు వేసిన వారిలో మహిళలే అధికంగా ఉన్నారు. పురుషులు 92,040మంది ఓటు హక్కు వినియోగించుకోగా 96,646 మంది మహిళలు ఎన్నికల్లో పాల్గొన్నారు. 2019 ఎన్నికల కన్నా ఈ ఎన్నికల్లో 1.7 శాతం తక్కువ ఓటింగ్ నమోదైంది. గత ఎన్నికల్లో 82,76 శాతం ఓటింగ్ నమోదు కాగా ఈ ఎన్నికల్లో 81.06 శాతం మాత్రమే నమోదైంది. రొంపిచర్ల, నరసరావుపేట రూరల్ మండలాలతో పోలిస్తే పట్టణ ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఆసక్తి కనబర్చలేదు. రొంపిచర్ల మండలంలో 87.31, నరసరావుపేట మండలంలో 87.10 శాతం నమోదు కాగా నరసరావుపేట పట్టణంలో కేవలం 72.23 శాతం మంది మాత్రమే ఓటింగ్‌లో పాల్గొన్నారు.

18 రౌండ్లలో కౌంటింగ్

జూన్ 4వ తేదీన నిర్వహించనున్న ఎన్నికల కౌంటింగ్ కోసం జేఎన్‌టీయూఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గానికి వేర్వేరుగా కౌంటింగ్ నిర్వహించనున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఫలితాల అనంతరం ఈవీఎంలను తెరిచి కౌంటింగ్ ప్రారంభిస్తారు. అసెంబ్లీ నియోజకవర్గ కౌంటింగ్‌కు 14 టేబుల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో రౌండ్‌కు 14 పోలింగ్ బూత్‌ల ఈవిఎంలను తెరిచి ఫలితాలను వెల్లడించనున్నారు. నియోజకవర్గంలో మొత్తం 245 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఎన్నికల తుది ఫలితం రావాలంటే 18 రౌండ్లు కౌంటింగ్ పూర్తి చేయాల్సి ఉంటుంది.

ఎడ్వర్డుపేట నుంచి కౌంటింగ్ ప్రారంభం

రొంపిచర్ల మండలం ఎడ్వర్డుపేట ఒకటవ నెంబర్ పోలింగ్ కేంద్రం నుంచి నియోజకవర్గం కౌంటింగ్ ప్రారంభం కానుంది. రొంపిచర్ల మండలంలో మొత్తం 64 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొదటి ఐదు రౌండ్లలో రొంపిచర్ల మండలం కౌంటింగ్ పూర్తి అవుతుంది. అనంతరం నరసరావుపేట మండలం ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. మండలంలో మొత్తం 84 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇందులోని 36 పోలింగ్ కేంద్రాల్లోని ఈవీఎంల లెక్కింపును రొంపిచర్ల మండలం అనంతరం లెక్కిస్తారు. ఇందులో పమిడిపాడు, రావిపాడు, ములకలూరు, కె.ఎం.అగ్రహారం, పెద్దరెడ్డిపాలెం, ఇస్సప్పాలెం దొండపాడు, జొన్నలగడ్డ, కేసానుపల్లి, బసికాపురం, కొత్తపాలెం గ్రామాలు ఉన్నాయి. మూడు రౌండల్లో ఈ గ్రామాల లెక్కింపు పూర్తయిన తరువాత బరంపేట 100 నంబరు పోలింగ్‌బూత్ నుంచి పట్టణంలోని ఈవీఎంల కౌంటింగ్ ప్రారంభమవుతుంది. పట్టణ పరిధిలోని 97 పోలింగ్ బూత్‌లను ఏడు రౌండ్లలో కౌంటింగ్ పూర్తి చేస్తారు. అనంతరం నరసరావుపేట రూరల్ మండలంలోని మిగిలిన గ్రామాల్లోని 48 పోలింగ్ కేంద్రాలను నాలుగు రౌండ్లలో లెక్కింపు నిర్వహిస్తారు. చివరగా మండలంలోని పెదతురకపాలెం పోలింగ్ కేంద్రం ఈవీఎం ఓట్ల లెక్కింపు ద్వారా కౌంటింగ్ ప్రక్రియ పూర్తవుతుంది.

రేపు కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న శ్రీకృష్ణ యాదవ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ సభ్యులు

చిలకలూరిపేట: పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన యాదవ విద్యార్థులు కెరీర్ గైడెన్స్ ప్రోగ్రామ్‌ను సద్వినియోగం చేసుకోవాలని శ్రీకృష్ణ యాదవ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు గోరంట్ల నారాయణ యాదవ్ చెప్పారు.ఈ నెల 26వ తేదీన గుంటూరులోని ఏటుకూరు రోడ్డులో ఉన్న వివాహ కన్వెన్షన్ హాలులో యాదవ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కెరీర్ గైడెన్స్ అవగాహన సదస్సుకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం పట్టణంలోని సీఆర్ క్లబ్ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఇంటర్‌లో ఏ గ్రూపు తీసుకుంటే ఎటువంటి అవకాశాలు ఉంటాయి, తద్వారా కెరీర్‌ను ఎంచుకునేందుకు ఈ అవగాహన సదస్సు ఉపయోగపడుతుందన్నారు. సదస్సులో యూనివర్సిటీ ప్రొఫెసర్లు, సబ్జెక్ట్ ఎక్స్‌పర్టులు పాల్గొని తగిన సూచనలు, సలహాలు అందజేస్తారని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని విద్యార్థులు పదో తరగతి మార్కుల మెమో జిరాక్స్ కాపీ, ఆధార్ జిరాక్స్ కాపీ తీసుకొని ఆదివారం ఉదయం 10 గంటలకు హాజరు కావాలని కోరారు. హాజరైన విద్యార్థులకు ఉచితంగా ఒక బ్యాగ్, కెరీర్ గైడెన్స్ కోర్స్ మెటీరియల్, డిక్షనరీ ఉచితంగా అందజేయబడుతుందన్నారు. వివరాలకు ఫోన్ నంబర్లు 9014650393, 9866013967లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సంఘ చిలకలూరిపేట శాఖ అధ్యక్షుడు గోలి భానుప్రకాశ్, కార్యదర్శి నర్రా నాగరాజు, ఆరాధ్యుల రామకృష్ణ, పోటు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరకు విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

హెచ్చరించిన ఏడీఏ మస్తానమ్మ



విత్తనాలు, ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ మస్తానమ్మ

చిలకలూరిపేట: విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని నరసరావుపేట వ్యవసాయ సహాయ సంచాలకులు పి.మస్తానమ్మ హెచ్చరించారు. పట్టణంలోని పలు విత్తనాలు, ఎరువుల దుకాణాలను శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆయా దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విత్తనాలను నిర్ణయించిన ధరలకే విక్రయించాలని సూచించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు తాము కొనుగోలు చేసే విత్తనాల కంపెనీ పేర్లు బ్యాచ్ నంబర్లు పరిశీలించాలని కోరారు. కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించి బిల్లులను తప్పనిసరిగా తీసుకోవాలని వెల్లడించారు. బిల్లులు అడిగి తీసుకోని పక్షంలో నకిలీ విత్తనాలు అంటగట్టే ప్రమాదం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి టి.శ్రీలత, సిబ్బంది పాల్గొన్నారు.

తూనికల్లో తేడాలుంటే కేసులు పెడతాం

- తూనికల, కొలతలశాఖ సత్తెనపల్లి ఇన్‌స్పెక్టర్ షేక్ జాన్ సైదా
- క్రోసూరు, అచ్చంపేటలోని కిరాణా, బియ్యం దుకాణాల తనిఖీ



బియ్యం తూకం పరిశీలించిన తూనికల కొలతల శాఖ సత్తెనపల్లి ఇన్స్‌పెక్టర్ షేక్ జాన్‌సైదా

క్రోసూరు: వ్యాపారులు తూనికల్లో అవతవకలకు పాల్పడితే తూనికల కొలతల శాఖ చట్టపరమైన చర్యలు తీసుకుంటుందని, అటువంటి దుకాణదారులపై కేసులు నమోదు చేస్తామని సత్తెనపల్లి తూనికలు, కొలతల శాఖ ఇన్స్పెక్టర్ షేక్ జాన్ సైదా శుక్రవారం హెచ్చరించారు. గుంటూరు జిల్లా డిప్యూటీ కంట్రోలర్ పి.శాలెంరాజు ఆదేశాల మేరకు క్రోసూరు, అచ్చంపేట లోని పలు కిరాణా, బియ్యం షాపులను తనిఖీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పలు దుకాణాల్లో బియ్యం 25 కిలోల బస్తాకు 24 కిలోలు మాత్రమే తూకాలున్నట్లు గుర్తించామన్నారు. వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా వినియోగదారులు దుకాణాల్లో తూనికలు ,కొలతల్లో మోసాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే 98851 27512 నంబరుకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఇది ఇలా ఉండగా తనిఖీ అధికారులు వస్తున్నట్లు తెలుసుకున్న దుకాణాదారులు ముందుగా షాపులు మూసివేశారు.

పాలిటెక్నిక్ కళాశాలలో క్యాంపస్ సెలక్షన్స్

ఎనిమిది మంది ఉద్యోగాలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో తహసీల్దారు ఎం.స్వర్ణ, ప్రిన్సిపల్ బీవీ రమాదేవి

క్రోసూరు: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం డిప్లొమా ఆఖరు సంవత్సరం చదువుతున్న సివిల్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించినట్లు కళాశాల ప్రిన్స్‌పల్ బి.రమాదేవీ తెలిపారు. సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు నలుగురు, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు నలుగురు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారికి అపాయింట్‌మెంట్ ఆర్డర్లను అందజేసేందుకు ఉద్యోగ విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా క్రోసూరు తహసీల్దార్ ఎం.స్వర్ణ పాల్గొని మాట్లాడుతూ కష్టపడి చదివితే వృత్తి విద్యా కోర్సులు విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఇస్తాయన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుకునే ప్రతి విద్యార్థి క్యాంపస్ సెలక్షన్స్‌లో ఎంపికైన విద్యార్థులను ఆదర్శంగా తీసుకొని ఉద్యోగ అవకాశాలు సాధించాలని కోరారు. అనంతరం హైదరాబాద్, జీఎంకే ఇంజినీర్స్‌కు ఇద్దరు డీఈఈ విద్యార్థులకు, తిరుపతి, ఆషియన్ ఆటో పార్ట్ ఇండియా లిమిటెడ్‌కు ఇద్దరు డీఈఈ విద్యార్థులకు ఉద్యోగ ఎంపిక ఉత్తుర్యుల కాపీలను అందజేశారు. అదేవిధంగా విశాఖపట్నంలోని అయ్యప్ప ఇన్‌ఫ్రాప్రాజెక్ట్ ప్రవేట్ లిమిటెడ్‌కు నలుగురు డీసీఈ విద్యార్థులకు ఉత్తుర్యుల కాపీలను అందజేశారు.ఈ కార్యక్రమంలో కంపెనీల ప్రతినిధులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

సత్తెనపల్లి: పట్టణానికి మిత్ర స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు కరాలపాటి శ్రీనివాస్ అనారోగ్యంతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మట్టి ఖర్చుల నిమిత్తం మృతుడి కుటుంబానికి సత్తెనపల్లి బీసీ సంఘాల తరుపున రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. అలాగే కొత్త రామకృష్ణ రూ. 2 వేలు, మర్రి వెంకట రామిరెడ్డి రూ. 2 వేలు, మదమంచి రాంబాబు రూ. 2 వేలు, గార్లపాటి ప్రభాకర్ రూ. 2 వేలు మృతుడి కుటుంబానికి సాయం అందించారు.

మండల విత్తన ప్రణాళిక సిద్ధం

నరసరావుపేట రూరల్: సాధారణం కన్నా అధిక వర్షపాతం నమోదు కావచ్చు అని వాతావరణ శాఖ ప్రకటనల నేపథ్యంలో మండల విత్తన ప్రణాళికను సిద్ధం చేసినట్టు మండల వ్యవసాయ అధికారి వి.సురేంద్ర బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రీ ఖరీఫ్‌లో భాగంగా పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు 50 శాతం సబ్సిడిపై అందజేస్తున్నట్టు తెలిపారు. జీలుగా–257 క్వింటాళ్లు, జనుము–125 క్వింటాళ్లు, పిల్లిపెసర–86 క్వింటాళ్లు మండలానికి అవసరమని ప్రతిపాదనలు పంపించినట్టు చెప్పారు. ఏపీ సీడ్స్ ద్వారా పచ్చిరొట్ట విత్తనాలు ఆర్‌బీకేలకు సరఫరా కాగా, ఆయా విత్తనాలను సబ్సిడీపై రైతులకు అందజేస్తున్నట్టు వివరించారు. కాగా మండలంలో మిరప పంట 1455 హెక్టార్లులో సాగు చేస్తారనే అంచనా ఉందని తెలిపారు. ఇందుకు 36375 ప్యాకెట్ల విత్తనాలు అవసరం కాగా, వివిధ కంపెనీల చెందిన మిరప విత్తనాలు అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. పత్తి పంట సాగు అంచనా 2762 హెక్టార్లు కాగా, 17,263 ప్యాకెట్లను డీలర్ల ద్వారా సిద్ధం చేసినట్టు చెప్పారు. దీంతో పాటు వరి, కంది, మినుము, పెసర విత్తనాలు రాయితీపై సరఫరా చేసేందుకు వ్యవసాయ శాఖ ప్రణాళికలు రూపొందించినట్టు తెలిపారు.

31 నుంచి హనుమజ్జయంతి వేడుకలు

సత్తెనపల్లి: పట్టణంలోని మహారాష్ట్ర వీధిలో ఉన్న శ్రీ భక్తాంజనేయ స్వామి దేవస్థానంలో ఈ నెల 31 నుంచి జూన్ 2వ తేదీ వరకు మూడు రోజుల పాటు హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలి రోజు ఉదయం సుప్రభాత సేవ, తోరణ అలంకరణ, 7 గంటలకు ప్రాత:కాలార్చన, 8 గంటలకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచన, మండపారాధన, నవ కలశ ఆరాధన, 9 గంటలకు పంచామృత స్నపన, 10 గంటలకు హనుమత్ హోమం, 11 గంటలకు రజత కవచ, పుష్పాలంకరణ, సహస్ర నాగవల్లి దళార్చన, 12 గంటలకు నీరాజనం, మంత్ర పుష్పం, తీర్థ గోష్ఠి, 5 గంటలకు బోనాలు, నగరోత్సవం జరుగుతాయన్నారు. జూన్ 1న ఉదయం 7 గంటలకు ప్రాతః కాలా ర్చన, విశేష పుష్పాలంకరణ, 8 గంటలకు వార్షిక ఘృత ఫలార్చన, 9:30 గంటలకు సహస్ర మామిడి ఫల విశేషార్చన, సామూహిక గంధ సిందూరార్చన, సాయంత్రం 5 గంటల నుంచి 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ, రాత్రి 7 గంటల నుంచి అష్టోత్తర శతనామ పూజలు జరుగుతాయన్నారు. జూన్ 2న ఉదయం 9 గంటలకు విశేష పుష్పార్చన, రాత్రి 7 గంటలకు పూలంగి సేవ, అనంతరం కొతారు రంజిత్ కుమార్ ఆర్కెస్ట్రా భక్త సంగీత కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాలు ఆలయ అర్చక స్వామి శ్రీమాన్ వేదాంతం విజయ నరసింహచార్యులు ఆధ్వర్యంలో జరుగుతాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని పేర్కొన్నారు.

క్షయ నివారణ కోసమే బీసీజీ టీకా

వైద్యాధికారి రావిపూడి రమ్య



శావల్యాపురం: క్షయ వ్యాధి నివారణకు బీసీజీ టీకా ఎంతగానో దోహదపడతుందని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రావిపూడి రమ్య అన్నారు. శుక్రవారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి మాట్లాడుతూ బీసీజీ టీకా వలన ఎలాంటి సైడు ఎఫెక్టులు ఉండవన్నారు. షుగర్ వ్యాధితో బాధపడేవారు, పొగతాగేవారు, ఎత్తుకు తగిన బరువు లేని వారందరు, గతంలో క్షయ వ్యాధి సోకి తగ్గిన వారందరితో పాటు వారి కుటుంబ సభ్యులు కూడా బీసీజీ టీకా చేయించుకోవటం భవిష్యత్‌లో క్షయ వ్యాధి సోకకుండా ఉంటుందన్నారు. 18 నుంచి 60 సంవత్సరాల పైబడిన వారందరు ఈటీకా వేయించుకోవాలన్నారు. రాష్ట్రంలో మొదట దశలో 12 జిల్లాలను ఎంపిక చేయగా అందులో పల్నాడు జిల్లా ఉందన్నారు. ఈటీకా ప్రక్రియ మూడు నెలల పాటు జిల్లాలోని అన్నీ గ్రామ సచివాలయాల పరిధిలో వైద్య ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షణలో ప్రతి నెలలో గురువారం రోజున ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి బీసీజీ టీకా కార్యక్రమం జరుగుతుందన్నారు. మూడు నెలల వ్యవధి ముగిసిన తదుపరి జాతీయ వైద్య ఆరోగ్య అధికారులు (ఐసీయంఆర్) టీకా చేయించుకున్న వారిని పరిశీలించి వారి ఆరోగ్య స్థితిగతులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారన్నారు. ఈ టీకాను క్యాన్సర్ బారిన పడినటు వంటి వారికి, ఎయిడ్స్ రోగులకు, గర్భిణులకు చేయరాదన్నారు. మండలంలో 3 వేలకు బీసీజీ టీకా చేయడానికి సంబంధిత సర్వేలో గుర్తించినట్లు వైద్యాధికారి రమ్య తెలిపారు. సూపర్‌వైజరు అలవలపాటి ఏడుకొండలు, స్టాఫ్‌నర్సు బాలిబోయిన లక్ష్మిప్రసన్న, ధనలక్ష్మి ఉన్నారు.

అడ్మిషన్లకు అనూహ్య స్పందన



అడ్మిషన్లు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న కళాశాల ఉపాధ్యాయులు శ్రీనివాసరాజు

శావల్యాపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో బాలికల జూనియర్ కళాశాలకు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అనూహ్య స్పందన వస్తుందని కళాశాల ఉపాధ్యాయులు కుమ్మరి శ్రీనివాసరాజు శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా గత ఏడాది విద్యా సంవత్సరంలో జూనియర్ కళాశాలకు ఏర్పాటుకు అనుమతులు రాగా 2023–24 విద్యా సంవత్సరంలో వచ్చిన పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు రావటంతో పాటు ఉపాధ్యాయులు కృషి ఫలితంగా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి విశేష స్పందన వస్తుందన్నారు. ఇప్పటి వరకు మొదట ఇంటర్మీడియట్ తరగతులకు 40 మంది బాలికల అడ్మిషన్లు రాసినట్లు చెప్పారు. ప్రభుత్వ పరంగా ఎలాంటి ఫీజులు లేవన్నారు. బాలికలకు అనూకూలంగా ఉంటుందని కార్పొరేటు కళాశాలకు దీటుగా ప్రత్యేకంగా ఏడు మంది ఉపాధ్యాయులచే మెరుగైన విద్యను బోధిస్తామన్నారు. ఈ ఏడాదిలో 33 మంది బాలికలు ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో పరీక్షలు రాయగా 25 మంది ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. ఇందుకుగాను జూనియర్ కళాశాల పరిధిలో ఉన్ననటు వంటి గ్రామాల్లో విస్తృతస్థాయిలో కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం చేస్తున్నామన్నారు. మరిన్ని వివరాలకు సెల్‌నంబరు 8639987471 సంప్రదించాలన్నారు.

ముగిసిన జ్యోతుల మహోత్సవాలు



జ్యోతుల ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

రొంపిచర్ల : మండల కేంద్రమైన రొంపిచర్లలో వేంచేసియున్న శ్రీ చౌడేశ్వరీ దేవి అమ్మవారి ఆలయంలో రెండవ రోజైన శుక్రవారం అమ్మవారి జ్యోతుల మహోత్సవాలు ముగిశాయి. తొగట, వీరక్షత్రియులు ఆధ్వర్యంలో గ్రామంలో అమ్మవారి జ్యోతుల ఊరేగింపు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. రొంపిచర్లలో నిర్వహించిన ఊరేగింపులో దోడ్లేరు, నెక్కల్లు గ్రామాలకు చెందిన అమ్మవారి జ్యోతులతో ఆ గ్రామాలకు చెందిన భక్తులు ఊరేగింపులో పాల్గొన్నారు. జ్యోతుల ఊరేగింపు కనులపండువగా సాగింది. కనక తప్పెట్లతో, మేళతాళాలతో జ్యోతులకు గ్రామోత్సవం నిర్వహించారు. జ్యోతులను ఎత్తుకొని భక్తులు, ఆచారవంతులు చేసిన నృత్యాలు, చెక్కభజన చేస్తూ ఆలపించిన గేయాలు గ్రామస్తులను ఆకట్టుకున్నాయి. గ్రామంతోపాటు పరిసర గ్రామస్తులు అమ్మవారి జ్యోతుల ఊరేగింపు కార్యక్రమాలు ఆసక్తికరంగా తిలకించారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. తొగట, వీరక్షత్రియుల ఆడపడుచులు, బంధువులు జ్యోతి మహోత్సవంలో పాల్గొనేందుకు రావడంతో ఇళ్లన్నీ సందడిగా ఉన్నాయి. గ్రామోత్సవ అనంతరం ఆలయ ఆవరణలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వేలాది మంది భక్తులు శ్రీ చౌడేశ్వరీ దేవి అమ్మవారి ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా బుద్ధ జయంతి



పదవ తరగతి టాపర్ రిషక రెడ్డికి నగదు ప్రోత్సాహకం అందిస్తున్న ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: ప్రకాష్‌నగర్‌లోని శ్రీతిలక్ మున్సిపల్ పాఠశాలలో శుక్రవారం శ్రీనాథ సాహితీ పరిషత్, ఆంధ్ర చైతన్య గ్రూప్ సంయుక్త ఆధ్వర్యంలో బుద్ధ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గౌతమ బుద్ధుని ధర్మం, బౌద్ధ స్థావరాలు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై బౌద్ధం ప్రభావం తదితర అంశాలపై పాఠశాల స్థాయి విద్యార్థులకు వకృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందచేశారు. పద్యకవి ఈపూరి వెంకటరెడ్డి బుద్ధునిపై పద్యాలను ఆలపించి రంజింప చేశారు. ఈసందర్భంగా పదవ తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల్లో పల్నాడు జిల్లా టాపర్‌గా నిలిచిన జి.రిషికరెడ్డికి ఆంధ్ర చైతన్య గ్రూప్ సంస్థ రూ.25 వేలు ప్రోత్సాహక బహుమతి అందించారు. తొలుత బుద్ధుడు, డాక్టర్ అంబేద్కర్ చిత్రపటాలను పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామి రెడ్డి, జన విజ్ఞాన వేదిక ప్రతినిధి చలమారెడ్డి, షేక్.బాజీ, రచయిత వెంకటేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.నరసింహారావు పాల్గొన్నారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

ఏవో వేణుగోపాల్



విత్తన దుకాణంలో తనిఖీ చేస్తున్న క్రోసూరు ఏవో వేణుగోపాల్

క్రోసూరు: పచ్చిరొట్ట విత్తనాలు జీలుగ, జనుము, పిల్లి పెసర 50 శాతం సబ్సిడీపై మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని ఏవో వేణుగోపాల్ శుక్రవారం తెలిపారు. జీలుగ సబ్సిడీ పోను రూ.44, జనుము రూ.44, పిల్లిపెసర రూ.67గా ఉన్నట్లు తెలిపారు. కావల్సిన రైతులు నేరుగా రైతు భరోసా కేంద్ర సిబ్బందిని సంప్రదించి పొందవచ్చునన్నారు. మండలానికి జీలుగ 118 క్వింటాళ్లు, 68 క్వింటాళ్ల జనుము, 68 క్వింటాళ్ల పిల్లి పెసర విత్తనాలు మొదటి విడతగా తెప్పించడం జరిగిందన్నారు.

విత్తన దుకాణాలను తనిఖీ చేసిన ఏవో..

విత్తనాల దుకాణాల్లో రైతులకు కావాల్సిన పత్తి విత్తనాలు విక్రయాలు జరుగుతున్నాయని ఏవో తెలిపారు. విత్తనాలకు కొనుగోలుకు సంబంధించిన బిల్లులు తప్పని సరిగా తీసుకోవాలని రైతులకు సూచించారు. అదేవిధంగా బ్యాచ్, లాట్ నంబర్ ఉన్నట్లు చూసుకుని బిల్లులను భద్రపరుచుకోవాలన్నారు. దుకాణ దారులు కూడా తమ వద్ద స్టాక్ వివరాలు తప్పని సరిగా కనబడేవిధంగా బయట బోర్డుపై నమోదు చేయాలన్నారు. రైతులకు తప్పని సరిగా బిల్లులు అందించాలన్నారు. రైతులు విత్తనాల కొనుగోళ్లలో ఏదైనా సమస్యలుంటే 83310 56937 నంబరుకు సంప్రదించవచ్చునన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నకరికల్లు: మండలంలోని దేచవరం ఆదర్శ పాఠశాలలో 7, 8, 9 తరగతుల ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ కె.వేళాంగిణి మేరీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తరగతికి వంద సీట్ల చొప్పున భర్తీ చేయనున్నట్లు తెలిపారు. సంబంధిత సర్టిఫికెట్లతో పాఠశాలలో నేరుగా సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు పాఠశాలలోని కార్యాలయంలో విద్యార్థులు, తల్లిదండ్రులు సంప్రదించాలని పేర్కొన్నారు.

విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

అమరావతి: ప్రభుత్వం నిర్ణయించిన ధరకలంటే అధికంగా విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని క్రోసూరు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు ఎం.హనుమంతరావు హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలో విత్తనాలు, పురుగు మందులు, ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. స్టాకు రిజిస్టర్లు, బిల్లు పుస్తకాలను తనిఖీ చేశారు. కలుపుమందు తట్టుకునే బీటీ విత్తనాల సాగుకు దేశంలో అనుమతి లేదన్నారు. పైన తెలిపిన విత్తనాలను అమ్మకాలు జరిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.